సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.9 : కనిష్ఠం 12.6

ఆంధ్రజ్యోతి



కామారెడ్డి
జిల్లా వార్తలు

5

మంగళవారం 9 డిసెంబరు 2025



నీటిని విడుదల చేస్తున్న అధికారులు

యాసంగికి సాగర్ నీరు

- ఆరు విడతలు 12 టీఎంసీలు నీటి విడుదల
- నీటి పారుదల శాఖ ఎస్ఈ దక్షిణమూర్తి

నిజాంసాగర్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంట సాగు కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్నట్లు నీటి పారుదల శాఖ ఎస్ఈ దక్షిణమూర్తి తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లకు సోమవారం నీటి పారుదశాఖ ఎస్ఈ దక్షిణమూర్తి, ఈఈ సోలోమోన్ ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన కాలువ వెంట 500 క్యూసెక్కుల చొప్పున నీటిని పక్షం రోజులకు ఒకసారి ఆరు విడుతల్లో 12 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని వెల్లడించారు. ప్రాజెక్టు ఆయకట్టు కింద ఏడాది యాసంగికి లక్షా 15 వేల ఎకరాలకు నీరు అందిస్తామని వివరించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 17.802 టీఎంసీ నీరు నిల్వ ఉందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ ప్రవీణ్ కుమార్, నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



అయ్యప్ప పడిపూజ పాల్గొన్న స్వాములు

- వైభవంగా మహా పడిపూజ
- పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

మద్నూర్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): స్వామియే శరణమయ్యప్ప.. దైవమే శరణమయ్యప్ప.. నామస్మరణ మద్నూర్ మండల కేంద్రంలో మార్మోగింది. మద్నూర్ అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో 34వ సమిష్టి మహాపడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ పడిపూజలో ఉమ్మడి మద్నూర్ మండలంతోపాటు బాన్సువాడ, పిట్లం, జుక్కల్, ఎల్లారెడ్డి, బిచ్కుంద నుంచి అయ్యప్పస్వాములు పాల్గొన్నారు. అయ్యప్ప గణపతి పూజతో ప్రారంభమై అర్ధరాత్రి వరకు కొనసాగింది. అనంతరం గురుస్వాములు మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష ఒక పవిత్రమైన కార్యక్రమని పేర్కొన్నారు. దీక్ష సమయంలో ఉపవాసం ఉండటంతో జీర్ణవ్యవస్థకు విశ్రాంతి లభిస్తుందని, దీంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని గుర్తుచేశారు. ఉపవాసాల వల్ల రక్తం జీర్ణ వ్యవస్థ శుద్ధి అవుతాయని శరీరంలో స్థాయికి మించి కొవ్వు కరుగుతుందని పేర్కొన్నారు. మనసును దుష్టతలంపుల నుంచి ప్రాపంచిక ఆందోళన నుంచి దూరం చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో గురు స్వాములు లక్ష్మణ్ స్వామి, రాజు స్వామి, సాయిలు స్వామి, హనుమాన్లుస్వామి, రఘు స్వామి ఉన్నారు.

ప్రతీ వాహనాన్ని
తనిఖీలు చేయాలి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి

మద్నూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసేవరకు చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి చెక్‌పోస్టు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆమె డోంగ్లి మండలం సిర్పూర్ చెక్‌పోస్టు తనిఖీచేశారు. అక్కడ వాహనాల రాకపోకలకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడున్న సిబ్బందితో మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యం, డబ్బు రాష్ట్రంలోకి రాకుండా వాహనాల తనిఖీ నిర్వహించాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్‌తో పాటు డోంగ్లి ఆర్ఐ సాయిబాబా సిబ్బంది తదితరులు ఉన్నారు.



పోలింగ్‌కు ఏర్పాట్లు

- 11న మొదటి విడత పంచాయతీ ఎన్నికలు
- పది మండలాల్లో 156 సర్పంచ్ స్థానాలకు 1,084 పోలింగ్ కేంద్రాలు
- ఇప్పటికే 11 సర్పంచ్, 433 వార్డు స్థానాలు ఏకగ్రీవం
- ఎన్నికల విధుల్లో 6,640 మంది అధికారులు, సిబ్బంది
- పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి
- మండలాలకు తరలుతున్న ఎన్నికల సామగ్రి

కామారెడ్డి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి రోజురోజుకూ వేడెక్కుతోంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో 25 మండలాలు ఉండగా, 532 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొదటి విడతలో 10 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మండలాల పరిధిలో 167 సర్పంచ్ స్థానాలు, 1520 వార్డు స్థానాలు ఉన్నాయి. ఇందులో 11మంది సర్పంచ్ అభ్యర్థులు, 433 వార్డుస్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 156 సర్పంచ్ స్థానాలకు, 1,084 వార్డు స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఎన్నికల కోసం 1,084 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.


6,640 మంది పోలింగ్ పోలింగ్ అధికారులు సిబ్బంది

కామారెడ్డి డివిజన్ పరిధిలోని 10 మండలాలైన భిక్కనూరు, దోమకొండ, బీబీపేట్, రాజంపేట్, తాడ్వాయి, రామారెడ్డి, సదాశివనగర్, మాచారెడ్డి, పాల్వంచ, కామారెడ్డి మండలాల్లో మొదటి విడత ఎన్నికలు ఈనెల 11న జరగనున్నాయి. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలు వెల్లడిస్తారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు ప్రిసైడింగ్ అధికారులను, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. 20 శాతం మంది రిజర్వ్‌తో కలిపి మొత్తం 6,640 మంది అధికారులు, సిబ్బంది పోలింగ్ నిర్వహణలో పాల్గొననున్నారు. ఇందులో 2,869 మంది - మిగతా 8లో

మొదటి విడుత పోలింగ్ వివరాలు

మండలం	సర్పంచ్ స్థానాలు	వార్డులు	పోలింగ్ కేంద్రాలు	పురుషుల ఓట్లు	మహిళ ఓట్లు	మొత్తం
భిక్కనూరు	18	154	154	18,708	20,404	39,112
బీబీపేట్	10	84	84	10,003	10,802	20,805
దోమకొండ	9	82	82	11,548	12,918	24,466
కామారెడ్డి	14	107	107	8,824	8,980	17,804
మాచారెడ్డి	21	102	102	9,475	10,271	19,746
పాల్వంచ	11	89	89	8,016	9,098	17,114
రాజంపేట్	16	100	100	10,771	11,692	22,463
రామారెడ్డి	18	125	125	12,843	14,218	27,061
సదాశివనగర్	21	214	214	15,856	17,202	33,058
తాడ్వాయి	18	111	111	12,298	13,807	26,105
మొత్తం	156	1,084	1,084	1,18,342	1,29,392	2,47,734

అవినీతి కంపు



- కొన్ని ప్రభుత్వ శాఖల్లో అంతులేని అవినీతి
- చేయి తడిపితేనే పని
- ఏజెంట్లు, దళారులతో కొందరు అధికారులు కుమ్మక్కు
- జిల్లాలో ఈ ఏడాది ఏసీబీకి చిక్కిన ఐదుగురు
- ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు కానీ సిటిజన్ చార్ట్
- నేడు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం

ప్రజలకు జవాబుదారీగా విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి కుంపంలో మునిగిపోతున్నారు. పలు ప్రభుత్వ శాఖలు, కార్యాలయాల్లో అంతులేని అవినీతి పాతుకుంది. చేయి తడపనిదే ప్రభుత్వ పనులు కావడం లేదని.. లంచం ఇస్తేనే ఫైలు ముందుకు కదులుతుందనే భావన ప్రజల్లో బలంగా నాటుకుంటోంది. కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయి లంచగొండి ఉద్యోగులకు కొంత ముట్టజేప్పుకుంటూ పని చేయించుకోవడం పరపాటిగా మారింది. అచయితే జిల్లాలో గడిచిన ఎనిమిది నెలల్లోనే పోలీసు శాఖకు చెందిన నలుగురు ఏసీబీకి పట్టుబడడంతో ఆందోళన కలిగిస్తోంది.

కామారెడ్డి, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి రాజ్యమేలుతోంది. ఒక్కో పని.. సంతకానికి ఒక్కో రేటు వసూలు చేస్తున్నారు. జిల్లాలో గడిచిన ఏడాదిలోనే ఐదురుగు ఉద్యోగులు ఏసీబీకి చిక్కడమే ఇందుకు నిదర్శనం. కార్యాలయాల వద్ద పుట్టుకొస్తున్న ఏజెంట్లు, మధ్య దళారులే ఆదాయ మార్గాలుగా మారుతున్నారు. ఉద్యోగులు విధిగా చేయాల్సిన పనికి తాము ఎందుకు లంచం ఇవ్వాలని కొందరు యువకులు అధికారులను ఎదిరిస్తే నిబంధనల ప్రకారం పనులు చేస్తామంటూ తీవ్ర జాప్యం చేయడమే కాకుండా కొర్రీలు పెట్టి పనులు జరగకుండా అడ్డుకుంటున్నారు. బాధితులు ఏమీ చేయలేక లంచం ఇస్తూ పనులు చేయించుకుంటున్నారు.

మధ్య దళారుల వ్యవస్థతో అవినీతి

రిజిస్ట్రేషన్, రవాణాశాఖ వంటి కొన్ని కార్యాలయాల్లో ఆ ప్రభుత్వ కార్యాలయాలకు అనుబంధంగా పనిచేస్తున్న ఏజెంట్లు, దళారులు లంచాలను ప్రజల నుంచి - మిగతా 8లో



దోమకొండలో పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎన్నికల్లో లోపాలకు తావివ్వొద్దు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

దోమకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి లోపాలకూ తావివ్వకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. ఎన్నికలకు సంబంధించిన మౌలిక వసతులను సోమవారం పరిశీలించారు. దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకుంటున్న విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత ఎన్నికల సిబ్బందితో మాట్లాడి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పారదర్శకంగా, సక్రమంగా కొనసాగుతున్న విధానంపై వివరాలు తెలుసుకున్నారు. రైతు వేదికలోఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ, మండల ప్రాదేశిక, జిల్లా ప్రాదేశిక రెండవ సాధారణ ఎన్నికలు 2025 నిమిత్తం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని - మిగతా 8లో..

సరిహద్దుల్లో
నిఘా పెంచాలి

- ఎస్పీ రాజేష్ చంద్ర

జుక్కల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలో గల మహారాష్ట్ర-కర్ణాటక సరిహద్దులో నిఘా పెంచాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. జుక్కల్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రాజేష్‌చంద్ర సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనంతరం ఆయన మాట్లాడుతూ సరిహద్దుల్లో నిఘా పెంచాలని ఎస్సై నవీన్‌చంద్రను ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకునేలా స్థానిక పోలీసులు భద్రత కల్పించాలని అన్నారు. జుక్కల్ మండలం సోఫూర్ గ్రామం వద్ద ఏర్పాటు చేసే చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలను పరిశీలించి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద సీఐ రవి కుమార్ జుక్కల్ ఎస్సై నవీన్ చంద్ర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ చంద్ర శేఖర్ రెడ్డి

చిరు వ్యాపారుల దుకాణాలను
తొలగిస్తే ఊరుకోం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్‌రెడ్డి

కామారెడ్డిటౌన్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ గోడకు ఆనుకోని ఉన్న చిరువ్యాపారులను ఆగం చేసి దుకాణాలను తొలగించాలని చూస్తే ఊరుకోబోమని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్రాపటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి రెండురోజుల క్రితం కామారెడ్డి రైల్వేస్టేషన్ ఆధునీకీకరణ పనుల పరిశీలనకు వెళ్లిన సందర్భంలో రైల్వేస్టేషన్ గోడకు ఆనుకొని ఉన్న ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించి మడుగులలో ఉన్న వ్యాపారులకు పొట్టి శ్రీరాములు విగ్రహం ప్రాంతంలో, గంజ్ స్కూల్ ప్రాంతంలో నిర్మించనున్న భవనాల్లోకి మారుస్తామని చెప్పారని అన్నారు. అయితే ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో ఇంకా - మిగతా 8లో..

గ్రంథాలయానికి
గ్రహణం

- నందిపేటలో 3 రోజులుగా లైబ్రరీ బంద్
- కప్పలు, పాములతో సావాసం
- పుస్తక పఠనానికి దూరమైన పాఠకులు
- హాజరుకాని సిబ్బంది

7

సొంతింటి కలకు
రుణసాయం

7

ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులు
ప్రతీ లెక్కా చెప్పాలి



మాట్లాడుతున్న పర్యవేక్షణ అధికారి సారిక

నాగిరెడ్డిపేట, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ఖర్చులకు సంబంధించి ప్రతీ లెక్కా చూపించాలని ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ అధికారి సారిక తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం అభ్యర్థులకు ఎన్నికల నియమావళి, ఎన్నికల ఖర్చులపై అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. సర్పంచ్ అభ్యర్థులు రోజువారీ ఖర్చుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో, తహసిల్దార్ శ్రీనివాస్ రావు, ఇన్చార్జి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పాల్గొన్నారు.



'మహాలక్ష్మి' మేజిక్
13.9 కోట్ల ప్రయాణాలు

- ఉచిత బస్సుల్లో ఊరూరా రద్దీ
- మహాలక్ష్మి ఉచిత బస్సు పథకానికి నేటితో రెండేళ్లు
- ఉచితంగా ప్రయాణించిన 13.9కోట్ల మంది మహిళలు
- ఆర్టీసీకి రీజియన్ వ్యాప్తంగా రూ.501.82కోట్ల ఆదాయం
- విద్యార్థినులు, ప్రైవేట్ ఉద్యోగులకు వరం
- బస్సుల్లో రద్దీతో డ్రైవర్లకు, కండక్టర్లకు ఇబ్బందులు
- నిత్యం ఓవర్‌లోడ్‌తో ఎక్కువైన బస్సుల మరమ్మతులు

రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చి నేటితో రెండేళ్లు పూర్తవుతుంది. 2023 డిసెంబరు 9న అధికారికంగా ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. రాష్ట్రమంతటా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఫ్రీబస్ సౌకర్యం అమలవుతోంది. నిజామాబాద్ రీజియన్ పరిధిలో సగటున రోజుకు రూ. 1.82లక్షల మంది ఉచితంగా ప్రయాణిస్తున్నారు. గతంతో పోల్చితే బస్సులు మహిళలతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. కాగా పురుష ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. కొందరు ప్రైవేటు వాహనాలను వినియోగిస్తున్నారు. కాగా మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఆర్టీసీకి లాభాలు వచ్చాయి. • కామారెడ్డి, ఆంధ్రజ్యోతి



ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం లాభదాయకం



• దీపిక, బాన్సువాడ

రాష్ట్రప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడం సంతోషంగా ఉంది. బాన్సువాడ నుంచి నిజామాబాద్‌వచ్చి ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తాను. గతంలో బస్సు చార్జీ రూ.150 వరకు ఖర్చయ్యేవి. ప్రస్తుతం ఉచిత బస్సు కావడంతో సుమారు రూ.3వేల వరకు మిగులుతుంది. నాలాంటి చిన్న ఉద్యోగం చేసేవారికి ఉచిత ప్రయాణం వరంలాంటిది.

వివరాలు 8లో

ఉచిత బస్సు ప్రయాణం ఎంతో మేలు



• నాగేశ్వరి, డొంకేశ్వర్

కళాశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. గతంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినీలు పాస్ తీసుకొని రావాల్సి వచ్చేది. పాస్ కోసం ఎన్నో పాట్లు పడ్డాం. కానీ ఇప్పుడు ఉచిత బస్సు సౌకర్యంతో ఆధార్ కార్డు చూపిస్తే డబ్బుల్లేకుండా టికెట్ ఇచ్చే వెసులుబాటు కల్పిస్తున్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

క్రైం సమాచారం

హైటెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కి
వ్యక్తి ఆత్మహత్యా యత్నం
» కోటగిరిలో కలకలం


హైటెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కిన సాయిలు

కోటగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ వ్యక్తి హైటెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్యా యత్నం చేయడం తీవ్ర కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. కోటగిరి గ్రామానికి చెందిన ఇందూరు సాయిలు సోమవారం కొత్త బస్టాండ్ సమీపంలోని హైటెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్య యత్నం చేశాడు. ఇందూరు సాయిలు తనయుడు మహేష్‌తో పాటు రెండు నెలల మనవరాలు రైస్‌మిల్లు గోడ కూలి మృతి చెందిన విషయం తెలిసిందే. గత సెప్టెంబర్ 23వ తేదీన ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. రైస్‌మిల్లు గోడ శిథిలావస్థకు చేరి ఇందూరు సాయిలు ఇంటిపై పడడంతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ విషయమై రైస్‌మిల్లు యజమానులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబానికి సుమారు మూ డు లక్షల రూపాయల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చిన యాజమానులు ఇంత వరకు నష్ట పరిహారం ఇవ్వకపోవడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. రైస్‌మిల్లు యజమానులతో పాటు మధ్యవర్తితత్వం వ్యవహరించిన నాయకులు పట్టించుకోకపోవడంతో సాయిలు హై టెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్యా యత్నం చేశాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై సునీల్ ఇందూరు సాయిలుతో మాట్లాడే ప్రయత్నం చేశాడు. విద్యుత్ స్తంభంపై చీరతో ఉరి బిగించి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించే ప్రయత్నం చేశాడు. కిందికి రావాలని ఎస్సై పలుమార్లు విజ్ఞప్తి చేశాడు. తన సమస్యను ఇప్పటికిప్పుడే పరిష్కరించి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఎస్సై సంబంధిత వ్యక్తులతో మాట్లాడి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని స్పష్టమైన హామీ ఇవ్వడంతో సాయిలు విద్యుత్ స్తంభం నుంచి కిందికి దిగి వచ్చాడు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో ఊపిరిపీల్చుకున్నారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన అనిల్

బాన్సువాడ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన అత్కూరి అనీల్ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబీకులు బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైనా చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు పట్టణ సీఐ శ్రీధర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు అనిల్ కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడని ఆస్పత్రిలో చూ పించుకున్న తగ్గకపోవడంతో బాధ భరించలేక గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతిచెందిన అనిల్ భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ కాంగ్రెస్ నాయకుడి మృతి


నవీన్ కుమార్(ఫైల్)

నవీపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాడాపూర్‌కు చెందిన ఎండల నవీన్ కుమార్ రావు(48) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. బినోల సొసైటీ మాజీ డైరెక్టర్‌గా పని చేసిన నవీన్ కుమార్ రావుకు గత నెల 27న బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందారు. నవీన్ కుమార్ రావుకు భార్య సోని, 11సంవత్సరాల కౌశిక్ అనే కుమారుడు ఉన్నారు. అతని అంత్యక్రియలను సోమవారం స్వగ్రామంలోని నాడాపూర్‌లో నిర్వహించారు. నవీన్ కుమార్ రావు తల్లి ఎండల లక్ష్మి ఇటీవల నాడాపూర్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

నవీపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గౌసియా బేగం అనే మహిళను బైక్ ఢీకొనడంతో ఆమె కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై నడుచుకుంటున్న వస్తున్న గౌసియా బేగంను రైల్వే గేటును నుండి నవీపేట వైపు వస్తున్న బైక్ వెనుక నుండి ఢీకొనడంతో గౌసియా బేగం కాలికి తీవ్ర గాయాలయ్యాయని, వెంటనే ఆమెను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులకు సమాచారం అందించినట్లు స్థానికులు వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జరిమానా

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ జరిమానా విధించినట్టు ఎస్‌హెచ్‌వొ సత్యనారయణ తెలిపారు. అతిగా మద్యం తాగి వాహనం నడిపిస్తున్న జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన సంపత్, ఆర్మూర్‌కు చెందిన బాలరాజు, అశోక్, చంద్రశేఖర్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఒక్కొకరికి పదివేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఒకరికి జైలుశిక్ష

ముప్కాల్: ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలో భాగంగా నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ ఒకరిని పట్టుకున్నట్లు ముప్కాల్ ఎస్సై కిరణ్ తెలిపారు. అతడి కౌన్సిలింగ్ నిర్వహించి ఆర్మూర్ కోర్టు ఎదుట హాజరు పర్చగా ఆర్మూర్ సెకంట్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాదర్ రెండు రోజుల పాటు సాధారణ జైలుశిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

వేల్పూర్‌లో పట్టపగలే చోరీ

వేల్పూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయ సమీపంలోని సుదర్శన్ ఇంట్లో సోమవారం పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు బోరికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి ఇంటి తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించిన బీరువాలో ఉన్న సుమారు 8 తులాల బంగారు దొంగిలించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ దొంగల ఆచూకి కోసం గాలిస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు. గ్రామంలో గుర్తు తెలియన కొందరు వ్యక్తులు తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్నారని వారి పట్ల గ్రామస్థులు జాగ్రత్త పడాలని, అపరిచితులు ఎవ్వరు కనిపించిన తమకు సమాచారం ఇవ్వాలని పోలీస్‌లో కోరారు.


వేల్పూర్‌లో చోరీ జరిగిన ఇంటి ముందు గుమిగూడిన స్థానికులు

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే సుస్థిర అభివృద్ధి
» బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులను గెలిపిస్తే గ్రామాలు సుస్థిర అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి గంధపు చైతన్య పవన్ కుమార్‌కు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు కాలనీవాసులతో సమావేశమై సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఉచిత బస్సు, 200 యూనిట్ల విద్యుత్‌తో పాటు అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించే అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, నాయకులు శంకర్ పటేల్, వర్ని శంకర్, రాజు, దత్తు, నబీ తదితరులు పాల్గొన్నారు.


పోతంగల్‌లో మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి


అంకాపూర్‌లో సీడ్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

అంకాపూర్‌ను సందర్శించిన
వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ఆర్మూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్ గ్రామాన్ని సోమవారం జగిత్యాల జిల్లా ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ పొలాస విశ్వ విద్యాలయం విద్యార్థులు సందర్శించారు. విద్యార్థులు క్షేత్ర ప్రదర్శనలో భాగంగా అంకాపూర్ గ్రామాన్ని సందర్శించి పంటల సాగు దిగుబడులు, మార్కెటింగ్ సౌకర్యం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని గ్రీన్ విజన్ సీడ్ ప్రాసెసింగ్ యూ నిట్‌ను పరిశీలించి రైతుల ద్వారా విత్తనోత్పత్తి చేయించే విధానం బైబ్యాక్ విదానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సతీష్, డాక్టర్ అర్చన, జయంత్, శ్రీలత, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన
150 మందిపై కేసులు నమోదు


బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తున్న ట్రాఫిక్ సీఐ

సుభాష్‌నగర్, డిసెంబ రు 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన వారం రోజుల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 150 మందిపై కేసులు నమోదు చేసి 13లక్షల 32వేల జరిమానా విధించినట్లు పోలీసు కమీషనర్ సాయిచైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్, నిజామాబాద్, బోధన్ డివిజన్‌లలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో, పోలీస్ స్టేషన్‌ల సరిహద్దుల్లో డిసెంబరు 1 నేఉంచి 8వ తేది వరకు నిర్వహించిన వాహన తనిఖీల్లో 150 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వీరిని సంబందిత కోర్టులో హాజరుపర్చగా 13లక్షల 32వేలు జరిమానా విధించడం జరిగిందని 21 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. వాహనదారులు వాహనానికి సంబందించిన ధృవపత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి తగిన చర్యలు తీసుకోవాలి


నవీపేటలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యాంప్రసాద్ లాల్

నవీపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు జీవీ.శ్యాం ప్రసాద్ లాల్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద పతిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్స్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, ఎస్ఐ తిరుపతి, ఎంపీవో రామకృష్ణ తదితరులున్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ చంద్రమోహన్

రెంజల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని ఎస్సై చంద్రమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలనుపరిశీలించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలలో కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అన్ని వసతులు కల్పించాల ని సూచించారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటుమన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది నవీన్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులున్నారు.

బోధన్ ఆలయాలు చరిత్రాత్మకం
» దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి


మారుతి మందిరాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బోధన్ ఆలయాలు చరిత్రాత్మకమని దేవాదాయ శాఖ రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంతో పాటు మారుతి మందిరం ఆలయాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగ ఆలయాల్లోని పరిసరాలను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల విశిష్టత గురించి ప్రవీణ్ మహరాజ్, గణేష్ మహరాజ్ వివరించారు. అనంతరం ఆమెను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో రాములు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామ పంచాయతీ వ్యవస్థ బలోపేతం

ముప్కాల్ , డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ ప్రజాస్వామ్య బద్ధంగా గ్రామా లకు కేంద్రం నిధులు ఇచ్చి గ్రామ పంచాయితీ వ్యవస్థ బలోపేతం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి అన్నారు. సోమవారం బా ల్కొండ మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు కలిపి పెడితే ప్రజాదనం మిగిలేదని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చక భయ పడిన సీఎం రేవంత్‌రెడ్డి సర్పంచ్ ఎన్నికలకు వెళ్తున్నాడని దుయ్యబడ్డారు. రాష్ట్రంలో రోడ్లు, డంపింగ్ యార్డులు, నల్లలు, వీది దీపాల నిర్వహణ , పంచాయతీ భవనాలు కేంద్రప్రభుత్వ నిధులతో అమలవుతున్నాయన్నారు. కాం గ్రెస్ అధికారంలోకి వచ్చి మూడునెలలకే సర్పంచ్‌ల పదవి కాలం ముగిసిందని ఈ 18 నెలల కాలంలో పంచాయితీ కార్యదర్శులు, జీపీ కార్మికులకు జీతాలు ఇయ్యలేక అప్పుల పాలు చేసిందని మండి పడ్డారు. బీజేపీ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం వివిధ పార్టీల నుంచి బీజేపీలోకి చేరిన అభ్యర్థులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, ముస్కు భూమేశ్వర్, ముస్కునర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బరిలో ఉందామా.. వద్దా!

డొంకేశ్వర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి నామినేషన్లు వేసిన అభ్యర్థులు పోటీలో ఉందామాతప్పుకుందామా అనే ఆలోచనలు చేస్తున్నారు. మూడో విడత ఎన్నికల్లో భాగంగా డొంకేశ్వర్ మండలంలో సర్పంచి వార్డు స్థానాల సభ్యుల పదవులకు పెద్ద ఎత్తున పోటీ చేసేందుకు అభ్యర్థులు నామినేషన్లు వేశారు.ఈనెల9వ తేదీ వరకు సమయం ఉంది. దీనితో సర్పంచ్ పదవిలో కోసం ఆశపడి వ్యక్తులు పోటీ చేస్తున్న వేరే అభ్యర్థులను బరిలో నుంచి తప్పించేందుకు ప్రత్యర్థులను బుజ్జగీస్తున్నారు. కొంతమంది అభ్యర్థులు ప్రత్యర్థులకు నయానో భయానో ఇచ్చి ప్రత్యర్థులతో భేరసారాలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో నామినేషన్ వేసిన అభ్యర్థులు పోటీలో ఉందామా తప్పుకుందామా అనే డైలామోలో పడ్డారు.


పాఠశాలకు కుర్చీలను అందజేస్తున్న క్షత్రియ విద్యాసంస్థల యజమానులు

ఆర్మూర్ బాలికల పాఠశాలకు
60 కుర్చీల వితరణ

ఆర్మూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు సోమవారం క్షత్రియ విద్యాసంస్థల తరపున 60 కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వనజ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం కంప్యూటర్ ల్యాబ్‌లో కుర్చీలను అందజేసిన క్షత్రియ విద్యా సంస్థల యజమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్జాపూర్ అక్షయ్, అల్జాపూర్ స్వప్న, అల్జాపూర్ పరిక్షిత్, ఫిజికల్ డైరెక్టర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

కొండెంగకు అంత్యక్రియలు


చనిపోయిన కొండెంగను అంత్యక్రియలకు తీసుకెళ్తున్న దృశ్యం

కోటగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని మంజీర నది సమీపంలోని వ్యవసాయ పొలంలో సోమవారం కొండెంగ మృతి చెందింది. స్థానికులు గమనించి మృతి చెందిన కొండెంగను గ్రామ పొలిమేరలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పూడ్చి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఓమన్న పటేల్, చాకలి శివ, షెట్టి సాయిలు, పిట్టి గంగారాం, కొట్టాల నాగేష్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఈత కొలనులో
పతకాల పంట


మిట్టపల్లి రిత్విక సాధించిన రజత, కాంస్య పతకాలు

నవీపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో 28వ స్పీడో ఇన్విటెషినల్ షాట్ కోర్స్ మీట్ స్విమ్మింగ్ పోటీల్లో మండలంలోని బినోలకు చెందిన మిట్టపల్లి రిత్విక రజత, కాంస్య పతకాలను సాధించింది. ఈ పోటీలను దుబాయ్‌లో ఈ నెల 6, 7వ తేదీల్లో నిర్వహించారు. వివిధ దేశాల స్విమ్మింగ్ అకాడమీలు పోటీలో పాల్గొనగా మన దేశం తరపున భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో కోచింగ్ నిర్వహిస్తున్న స్పోర్ట్ అథారిటి ఆఫ్ ఇండియా గ్లెన్ మార్క్ తరపున మిట్టపల్లి రిత్విక ఈ పోటీలలో పాల్గొన్నారు. 50మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌ను 33.26 సెకన్‌లలో పూర్తి చేసి రజత పతకం, 100 మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌ను 1:15.59 సెకన్‌లలో పూర్తి చేసి కాంస్య పతకం సాధించింది. రజత, కాంస్య పతకాలు సాధించిన మిట్టపల్లి రిత్వికను స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా గ్లెన్ మార్క్ మేనేజ్‌మెంట్‌తో పాటు కోచ్ పార్థ, తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి ఉమేష్, ఉపాధ్యక్షులు మహిపాల్ రెడ్డిని అభినందించారు.

ఈ నెల 21న జాతీయ లోక్ అదాలత్

నిజామాబాద్ లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ జి.వి.ఎన్ భారత లక్ష్మీ సోమావారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిన్న చిన్న కేసులకు కూడా కోర్టు మెట్లు ఎక్కడం ఎక్కువైపోయిందని ఆమె విశ్లేషంచారు. దీని వలన ప్రధానమైన న్యాయ వివాదాలపై ద్రుష్టి కేంద్రీకరించడానికి కోర్టులకు సమయం సరిపోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ రం గ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న రుణగ్రహీతలు ఏవైనా కార ణాల వల్ల రుణాలు బ్యాంకులకు చెల్లించని వారు లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని ఆర్థిక లబ్ది పొందవచ్చని జిల్లా జడ్జి సూచిం చారు. చెక్ బౌన్స్ కేసులు, వినియోగదారుల వివాద కేసులు రాజీ చేసు కుని వ్యాపారాలలో ఆర్థిక ఉన్నత స్థితికి చేరుకోవచ్చని అన్నారు. న్యాయ వివాదం తమ మధ్య ఉన్నదని ఇరుపక్షాలు భావించినప్పుడు జిల్లా న్యాయసేవ అధికార సంస్థలో ఉమ్మడిగా దరఖాస్తు దాఖలు చేస్తే శాశ్వ త న్యాయ పరిష్కారం లభిస్తుందని ఆమె తెలిపారు. ఒకసారి లోక్ అదా లత్‌లో రాజీపడిన కేసులకు అవార్డులు జారీ చేస్తామని అవి అంతిమ మని అన్నారు. వాటికి అప్పీలు చేసుకునే అవకాశాలు లేవని ఆమె తెలిపారు. కేసులు నమోదు చేసుకున్న రోజులలో ఉన్న కోపతాపాలు మరుసటి రోజులలో ఉండవని తెలుపుతు వివాదాలు, కక్షలు కారుణ్యాలు లేని శాంతియుత సమాజమే అందరి అభిమతం కావాలని ఆమె ఆకాక్షించారు. సమాజంలో మనుషులుగా జీవిస్తామని ప్రతిరోజు ఒకరి ముఖాలు ఒకరం చూసుకోవలసిందేనని శత్రుత్వ భావనతో చూసుకోకుండా, సోదర భావంతో చూసుకుని కలిసిమెలిసి నడుచుకోవడంలోనే అన్ని సమస్యల కు పరిష్కారాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ గురించి విస్తృత ప్రచారం ప్రజల్లోకి వెళ్లాల్సిన అవశ్యకత ఉన్న దని ఆమె అన్నారు. నిజామాబాద్ జిల్లాలో 2,65,968 మోటారు చట్ట ఉల్లంఘన క్రిమినల్ కేసులు నమోదు అయి ఉన్నాయని ఆమె తెలిపారు. 5 నుంచి55 వరకు ఉల్లంఘన కేసులు ఉన్న మోటారు వాహనదారులు లోక్ అ దాలత్‌లో వారి కేసులను పరిష్కరించుకుని 50 శాతం మినహా యింపు ఉంటుందని ఆమె తెలిపారు. ట్రాఫిక్ ఉల్లంఘనల ద్వారా ఉల్లంఘించిన వాహనదారులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉన్నదని దాని వలన వారు వారి కుటుంబానికి భారమే అవుతున్నారని ఆమె పేర్కొన్నారు. సంస్థ జిల్లా కార్యదర్శి, సీనీయర్ సివిల్ జడ్జి సాయిసుధ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌కు ప్రజలు సహకారం అందించాలని కోరారు. లోక్ అదాలత్ విజయవంతం చేయాలని ఆమె అన్నారు. నిజామాబాద్ ట్రాఫిక్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ మస్తాన్ అలీ మాట్లాడుతూ రాజీపడదగిన క్రిమినల్ కేసులు అన్నింటికీ నోటీసులు జారీ చేస్తామని లోక్ అదాలత్‌లో రాజీ పద్ధతిన పరిష్కరించుకునే వీలు ఉన్నదని వివరించారు. జాతీయ లోక్ అదాలత్ ప్రచారానికి వీలుగా గోడ పత్రులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రసాద్, సంస్థ సుపరిండెంట్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

సిద్దుల గుట్టపై ప్రత్యేక పూజలు


శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు

పెర్కిట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ద పుణ్యక్షేత్రం నవనాథ సిద్దుల గుట్ట పై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్టపైకి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయంలో పంచామృతాలు, బిల్వ పత్రాలతో అభిషేకం చేశారు. రామాలయం, దుర్గ మాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మ తల్లి, ఏకశిల స్తం భం వద్ద గల హనుమాన్ ఆల యంలో ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో పల్లకి సేవా ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ భజన మండలి సభ్యుడు భక్తిగీతాలు పాడుతూ నృత్యాలు చేశారు. భక్తుల సహాయ సహకారాలతో కొన సాగు తున్న అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, రవి, సంధ్య, బట్టు శంకర్, ప్రశాంత్‌గౌడ్, చందేసి శ్రీనివాస్, కొంతం మురళి, సిద్దుల గుట్ట సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ సందర్భంగా
ప్రచార కార్యక్రమాలు నిషేధం

సుభాష్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలోని మొదటి విడతలో ఎన్నికలు జరుగనున్న బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, నవీపేట మండలాల పరిధిలో ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుంచి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. 44 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో పై మండలాలలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

యాసంగి 65 టీఎంసీల నీటి విడుదల ఖరారు
» 24 నుంచి కాలువలకు నీటి విడుదల

మెండోర, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాలను సస్యశ్యామలం చేస్తున్న శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుండి యాసంగి పంటలకు 65 టీఎంసీల నీటి కేటాయింపు జరిగిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న 7.56 లక్షల ఎకరాలకు సాగు తాగు నీటిని అందిచనున్నారు. రైతులు ఆశించిన విధంగానే ఈ సీజన్లో నీటి విడుదల చేయనున్నారు. దీంతో దిగు వన ఉన్న ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా వారబంది ప్రకారం 8 రోజుల పాటు ఎల్ఎండి ప్రాజెక్టుకు నీటిని అందిస్తారు. ఏడు రోజుల పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న ఆయకట్టుకు నీటి విడుదల జరగనుంది. లక్ష్మీ, సర స్వతి కాలువలకు ప్రాజెక్టు నుండి నిరంతరంగా నీటి విడుదల కొన సాగనుంది. చౌట్‌పల్లి, హనుమంత్ రెడ్డి, ఆలీసారగ్ గుత్ప ఎత్తి పోతల పథకాలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందనుంది. రైతులు సాగునీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు.

ఇదే సార్.. మా బాండు





- పల్లెపోరులో బాండ్‌పేపర్ రాజకీయాలు
- హామీలు నెరవేర్చకపోతే రాజీనామా చేస్తా
- ఆస్తులు సంపాదిస్తే జప్తు చేసుకోవచ్చు

పంచాయతీ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది. బరిలో నిలిచిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకెళ్తన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెట్టిస్తామంటూ.. ఎన్నికల్లో తమకే ఓటు వేయాలంటూ హామీల వర్షం కురిపిస్తున్నారు. కాగా పలుచోట్ల ఎలాంటి అక్రమాలకు పాల్పడమంటూ బాండ్ పేపర్లు రాసి ఇవ్వడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నిజామాబాద్ జిల్లాలోని నందిపేట మండలం ఉమ్మెడ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి గుడ్డోళ్ల సాయరెడ్డి అలియాస్ సాయన్న తనను సర్పంచ్‌గా ఎన్నుకుంటే పంచాయతీలో పైసా అక్రమం ఉండవు. ప్రజల (పంచాయతీ) సొమ్మును అక్రమంగా ఖర్చు చేయను. తప్పుడు లెక్కలు చూపించను.



ప్రస్తుతం ఉన్న ఆస్తుల కంటే ఎక్కువ ఆస్తులు అక్రమంగా సంపాదిస్తే, ఆ ఆస్తులను పంచాయతీ జప్తు చేసుకోవచ్చని గ్రామ ప్రజలకు బాండ్ పేపర్ రాసిచ్చారు.

● మరోవైపు భిక్కనూరు మండలంలోనూ ఓ అభ్యర్థి అలాగే బాండ్ రాసిచ్చారు. మల్లుపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో నిలిచిన మాలే పావని నర్సింలు తమను గెలిపిస్తే సీసీరోడ్లు, డ్రైనేజీలు, సీసీ కెమెరాల ఏర్పాటు, కోతుల బెడదకు పరిష్కారం, తదితర వాటిని నెరవేరుస్తానని లేదంటే పదవికి రాజీనామా చేస్తా అని గ్రామస్థులకు రూ.100ల బాండ్ పేపర్ రాసిచ్చారు.

- నందిపేట, భిక్కనూరు

ఓటు కోసం ఫ్లైట్..!



నందిపేట, డిసెంబరు 08 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎవరికి వారు ఓటర్లను ప్రసన్నం చేసుకుకునేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా సర్పంచ్ బరిలో ఉన్న అభ్యర్థులు దూర ప్రాంతాల్లో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు, వలస దారులకు గాలం వేస్తున్నారు. వారి వారి కుటుంబ సభ్యుల ద్వారా ఫోన్‌నంబర్లు సేకరించి బొంబాయి, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో ఉన్న వారిని మచ్చిక చేసుకుంటున్నారు. ఈ నెల 17న ఓటింగ్ రావాలని, మీకు ఫ్లైట్ టికెట్‌కు డబ్బులు పంపుతున్నాని మాట్లాడుకుంటున్నారు. గుర్తులు రాగానే వాట్సాప్ చేస్తానని, మీరు మాత్రం గుర్తుంచుకొని తప్పకుండా రావాలని వేడుకుంటున్నారు. ఒక్కసారి ఛాన్స్ ఇచ్చి చూడుండ్రి.. మర్చిపోకుండ్రి. ఫ్లైట్ టిక్కెట్‌కు మాత్రం డబ్బులు వేస్తున్నా. అంటూ బుజ్జగిస్తున్నారు.హైదరాబాద్‌లో ఉన్న పీజీ విద్యార్థులకు బస్ టిక్కెట్లకు డబ్బులు పంపుతామని, ఎక్కువ మంది ఉంటే టాక్సీ తీసుకొని రావాలని, ఆ ఖర్చు నేనే భరిస్తానని చెబుతున్నారు. పోలింగ్ రోజే రావాలంటే కష్టం కావచ్చు. రెండు రోజుల ముందే రండి అని వేడుకుంటున్నారు. మరి ఈ టికెట్ల ఎర ఫలించేనో లేదో చూడాలి మరి.

బుజ్జగింపులు.. బేరసారాలు

ముప్కాల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ ఎక్కువైన స్థానాల్లో నామినేషన్ విత్‌డ్రా కొరకు ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. నామినేషన్ విత్‌డ్రా గడువు మంగళవారం వరకు ఉండటంతో బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో ఏకగ్రీవమే లక్ష్యంగా ఆశవాహులు బుజ్జగింపులు, బేరసారాలకు ప్రసనం చేసుకుంటున్నారు. చాలాచోట్ల నామినేషన్‌లు విత్‌డ్రా చేసుకునేందుకు లక్షల్లో ముడుపులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. కుల పెద్దలను ప్రసన్నం చేసుకుని రాజీ కుదించేందుకు విందు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. మరో పక్క సర్పంచ్ పోటీ నుంచి తప్పుకుంటే ఎంపీటీసీ ఎలక్షన్‌లో మద్దతుగా ఉంటామని ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు.



మద్నూర్ మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు

సొంతింటి కలకు రుణసాయం

మద్నూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్రప్రభుత్వం స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల సాయం అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే పెరిగిన ఖర్చులతో ప్రభుత్వం అందించే నగదు పూర్తిస్థాయిలో సరిపోవడం లేదు. ఇది గమనించిన ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.4 లక్షల వరకు రుణం అందిస్తోంది.

ఉమ్మడి మద్నూర్ మండలంలో ఇలా..

ఉమ్మడి మద్నూర్ మండలంలో 120 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇప్పటి వరకు రూ.1.40 కోట్ల రుణాలు అందించారు. వాస్తవానికి ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు 4 విడతల్లో రూ.5 లక్షలను ప్రభుత్వం అందజేస్తుంది. పునాది పూర్తయితే మొదటి విడతగా రూ.లక్ష బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. అయితే లబ్ధిదారుల్లో పేదలే అధికంగా ఉండటంతో ఇంటి నిర్మాణానికి డబ్బులు లేక అవస్థలు పడుతున్నారు. అలాంటి వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణం అందిస్తున్నారు. దీంతో పేద మధ్యతరగతి ప్రజలకు ఊరట కలుగుతుంది.

తక్కువ వడ్డీతో రుణాలు



ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకునే వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలిస్తున్నాం.అర్హత కలిగి ఉండి తీర్మానం చేసి పంపితే బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తున్నాం. లబ్ధిదారులు ప్రతి నెల తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

- ఏపీఎం జగదీష్, మద్నూర్

సోయా పాయె.. కంది కలిసొచ్చేనా

- సోయాతో నష్టపోయిన రైతులు
- కంది పంటపై ఆశలు పెట్టుకున్న అన్నదాత
- బిచ్కుందలో 10వేల ఎకరాల్లో కంది పంట సాగు

బిచ్కుంద, డిసెంబరు 08 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో ఈ సీజన్‌లో ఆశించిన మేర సోయాపంట దిగుబడి రాక నిరాశకు గురైన అన్నదాతలు కంది పంటపై ఆశలు పెట్టుకున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలంలో మండలంలో 16, 500 ఎకరాల వరకు సోయాపంట సాగవగా అంతర్ పంటగా దాదాపు 10వేల ఎకరాల వరకు రైతులు కంది సాగు చేస్తున్నారు.

తగ్గిన సోయా దిగుబడి

విపరీతమైన వర్షాలతో ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు రావలసిన సోయా దిగుబడి 2- 3 క్వింటాళ్లకే పరిమితమైంది. ఇక ప్రస్తుతం సాగుచేస్తున్న కంది పంట మంచి దిగుబడిని ఇస్తే ఎకరాకు 5- 8 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశముంది. ప్రస్తుత మార్కెట్‌లో కంది క్వింటాళ్ల ధర రూ.7200- రూ.8000 ఉంది. ప్రస్తుతం కంది పంట ఆరోగ్యకర పూతదశలో రైతుల కళ్లల్లో ఆనందాన్ని నింపుతున్నా, ఒక్కోసారి పూత రాలే ప్రమాదముందని, అలాంటి పరిస్థితి ఏర్పడొద్దని రైతులు కోరుకుంటున్నారు. అనుకున్న మేర సోయా దిగుబడి రాక పెట్టుబడి సైతం మిగలని రైతులకు కంది పంట ఎకరాకు 5-7 క్వింటాళ్ల దిగుబడి వస్తే దాదాపు రూ.50 వేల లాభం వస్తుందని ఆశతో ఉన్నారు.

పెట్టుబడి కూడా రాని పరిస్థితి



సొయా ఆశించిన మేర దిగుబడి రాక పెట్టుబడి కూడా రాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి కంది మంచిది కొంతమేర సొయా నష్టం నుండి తెరుకుంటాం..

- కర్మా సాయిలు, రైతు, బిచ్కుంద

సోయా పంట నష్టాన్ని మిగిల్చింది



మంజీర నది ఒడ్డున చేను కలిగీ ఉండడంతో వాగు పొంగీ సోయపంట నీటమునిగీ పూర్తిగా నష్టాన్ని మిగీల్చింది కంది దిగుబడి పైనే ఆశలు

- బస్వరాజ్, రైతు, పెద్ద దేవాడ

స్థూల అర్థశాస్త్రం పుస్తక ఆవిష్కరణ



తెలంగాణ విశ్వవిద్యాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

ఇందూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఏ స్థూల అర్థశాస్త్రం మొదటి, రెండవ సెమిస్టర్ పుస్తకాన్ని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి ఆవిష్కరించారు. డిచ్‌పల్లిలోని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ మోచి సిద్ధలక్ష్మి ఆదాయం, ఉపాధి సిద్ధాంతాలపై ఈ పుస్తకాన్ని రచించారని అన్నారు. ఈ పుస్తకాన్ని నల్గొండ ఎకనామిక్స్ ఫోరం అక్కి నపల్లి మీనయ్య ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ యాదగిరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ స్వప్న, డాక్టర్ పాత నాగరాజు, డాక్టర్ సంపత్, డాక్టర్ శ్రీనివాస్, డా.దత్తహరి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రశాంతం

తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ పరీక్షలు 16వ రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 30 సెంటర్‌లలో మంగళవారం పరీక్షలు నిర్వహించినట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చక్రపాణి తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 88 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 77 మంది విద్యార్థులు హాజ రయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 748 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 684 మంది విద్యార్థులు హాజరుకాగా 64 మంది విద్యార్థులు గైర్హాజర య్యారని వివరించారు.

యువగళం



అభివృద్ధి చేసే వారికే ఓటేస్తా

నిస్వార్థంతో గ్రామ అభివృద్ధి కోసం పాటుపడే వారికి ఓటువేస్తా. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు నాకు మొదటిసారి వచ్చింది. ఈ ఓటు హక్కును నిస్వార్థంతో గ్రామం కోసం పాటుపడే వారి కోసం ఉపయోగించుకుంటా. ఎన్నికల్లో మొదటిసారి ఓటు వేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

- నారా అవంతిక

చాలా ఆనందంగా ఉంది



తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోవడం చాలా ఆనందంగా ఉంది. ప్రజా సమస్యలు పరిష్కరించే వ్యక్తికి ఓటేస్తా. ప్రలోభాలకు గురిచేసి డబ్బులు ఇచ్చి ఓట్లు వేయించుకోవడానికి చాలామంది ప్రయత్నిస్తారు. అలా కాకుండా అనునిత్యం ప్రజా సమస్యల కోసం పని చేసే వ్యక్తికి మాత్రమే ఓటుస్తా. ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే నిలదీసి ప్రశ్నిస్తా.

- సాయిప్రణవ్, బషీరాబాద్

ఓట్ల కోసం నేతల పాట్లు



నిబద్ధత లేని రాజకీయాలతో నాయకులు అయోమయానికి గురైతున్నారు. అందుకోసమే పార్టీలు మారుతున్నారు. ఓట్ల కోసం నేతలు పాట్లు పడుతున్నారు. అందువల్ల నాయకులు, కార్యకర్తల్లో విశ్వాసం సన్నగిల్లుతొంది. ప్రజాస్వామ్య విలువలు కాపాడే వారికి మాత్రమే ఓట్లు వేసి గెలిపించుకోవాలి.

- సయ్యద్ అఫాన్, నందిపేట

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు


- ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

నాగిరెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిబంధనల ప్రకారం సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నట్టు ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన పోలింగ్ అధికారులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని , పోలింగ్ రోజు సరైన సమయానికి ఎన్నికల పోలింగ్ ప్రారంభం అయ్యేలా ఎన్నికల సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి, గాంధారి, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాల్లో రెండో విడత గ్రామ పంచాయితీ ఎన్నికలు జరగాల్సి ఉండగా డివిజన్ పరిధిలో 144 సర్పంచ్ స్థానాలకు 41 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమైనట్లు, 11,085 వార్డు స్థానాలకు గాను 692 వార్డు సభ్యులు ఏకగ్రీవమైనట్లు ఆయన తెలిపారు. గాంధారి మండలంలో 16 సర్పంచ్ స్థానాలు, 257 వార్డు స్థానాలు, లింగంపేట మండలంలో 14 సర్పంచ్ స్థానాలు, 194 వార్డు స్థానాలు, నాగిరెడ్డిపేట మండలంలో 6 సర్పంచ్ స్థానాలు, 103 వార్డు స్థానాలు, ఎల్లారెడ్డి మండలంలో 5 సర్పంచ్ స్థానాలు, 138 వార్డు స్థానాలు ఏకగ్రీమైనట్లు ఆయన తెలిపారు. డివిజన్‌లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఇంచార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు మధుమేహ పరీక్షలు



స్వాములకు రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

బీర్కూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోతంగల్‌కు చెందిన అయ్యప్ప మాలధారణ స్వాముల కోసం సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో సు మారు 30 మంది అయ్యప్ప స్వాములకు మధుమేహ పరీక్షలు నిర్వహించారు. స్వా ములకు ఎవరికి మధుమేహం లేదని వైద్యసిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్, శ్రీశైలం, రాజు, అనిల్, శ్రవణ్, ముకేష్, శంకర్, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పిట్లం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పిట్లం మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సోమవారం కామారెడ్డి జిల్లా పోలీసు కళా బృంద సభ్యులు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు బాల్యవివాహాలు, సైబర్ ఫ్రాడ్‌కా ఫుల్‌స్టాఫ్, ప్రేమలు, మోసాలు, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్, రోడ్డు ప్రమాదాలు, సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కళా బృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ శేషారావు, పీసీఎస్ ప్రభాకర్, సాయిలు, ఇంచార్జి హెడ్ మాస్టర్ జరీనా, ఉపాధ్యాయబృందం, జిల్లా మహిళా సాధికారిత సిబ్బంది శారద, చైల్డ్ హెల్ప్‌లైన్ స్రవంతి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల బంద్

సుభాష్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో మద్యం దుకాణాలు మూసివేయనున్నట్లు ఎక్సైజ్ సూపరిండెంట్ మల్లారెడ్డి తెలిపారు. మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న బోధన్ డివిజన్‌లోని బోధన్, చందూరు, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి మండలాల్లో 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 11వ తేదీ ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు బంద్ ఉంటాయన్నారు. 2వ విడత ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ డివిజన్‌లోని నిజామాబాద్ రూరల్, ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్‌వాయి, మాక్లూర్, మోపాల్, సిరికొండ, జక్రాన్‌పల్లి మండలాల్లో 12వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 14వ తేదీ వరకు, చివరి దశ ఎన్నికల్లో ఆర్మూర్ డివిజన్‌లోని ఆర్మూర్, భీంగల్, ఆలూరు, బాల్కొండ, డొంకేశ్వర్, కమ్మర్‌పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట, వేల్పూర్, ఏర్గట్ల మండలాల్లో 15వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 17న ఫలితాలు వచ్చే వరకు మూసి ఉంచనున్నట్లు తెలిపారు.

నేడు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్

బాన్సువాడ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు మాజీ మున్సిపల్ చైర్మెన్ షేక్‌జుబేర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ ఇంచార్జి బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొనున్నారని, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.


ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



మంచిప్పలో వీరబ్రహ్మంగారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మోపాల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచిప్ప గ్రామంలో సోమవారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మ ఆలయం వద్ద అగ్నిగుండంలో నడుస్తున్న మహిళలు

మోపాల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మోపాల్ మండలంలోని ముదక్‌పల్లి గ్రామ శివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. కులసభ్యులు బోనాలతో ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. గత రెండు రోజుల నుంచి ఆలయం వద్ద పూజ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అక్కడ అగ్నిగుండం ఏర్పాటు చేసి మహిళలు, పురుషులు అగ్నిగుండంలో నడిచారు. చేసిన పాపాలు తొలగిపోయి అందరిని చల్లగా ఉంచాలని ఎల్లమ్మ తల్లికి మొక్కుతూ అగ్నిగుండంలో నడుస్తుంటారని కుల పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కల్యాణోత్సవం కూడా ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

గ్రంథాలయానికి గ్రహణం



- నందిపేటలో 3 రోజులుగా బంద్
- కప్పలు, పాములతో సావాసం
- పుస్తక పఠనానికి దూరమైన పాఠకులు
- హాజరుకాని సిబ్బంది

నందిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్మల్ గ్రామంలో ఉన్న శాఖా గ్రంథాలయం 3 రోజుల నుంచి మూత పడింది. తలుపులు, కిటీకీలు సరిగా లేక కప్పలు, ఎలుకలు, పాములు సావాసం చేస్తున్నాయి. దీంతో పాఠకుల హాజరు తగ్గింది. ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో సుమారు 15వేల పుస్తకాలు తుప్పుపడుతున్నాయి. లైబ్రేరియన్, స్లీపర్‌లు సైతం డుమ్మా కొడుతున్నారు. స్లీపర్‌కు జీతం డబ్బులు రాకపోవడంతో గ్రంథాలయాన్ని శుభ్రం చేయడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, పుస్తకప్రియులు కోరుతున్నారు.

1981లో గ్రంథాలయ ఏర్పాటు..

1981లో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి గ్రామాభివృద్ధి కమిటీ భవనంలో కొనసాగుతూ వచ్చింది. రెండు ఇరుకు గదుల్లోనే సాగింది. కూర్చుండి చదువుకునే వీలు లేక పాఠకులు రాని సందర్భాలెన్నో. అయితే గత ప్రభుత్వ హయాంలో గ్రంథాలయ నిర్మాణానికి రూ.4లక్షలు మంజూరయ్యాయి. అవి సరిపోకపోవడంతో మరో రూ.3లక్షలు మంజూరు చేసింది. ఆ డబ్బులతో పూర్తయిన గ్రంథాలయ భవనం నేటికి అధికారికంగా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. అయినప్పటికీ మూడేళ్లుగా నూతన భనంలోనే పుస్తక పఠనం జరుగుతోంది.

వెంటనే మరమ్మతులు చేపట్టాలి



గ్రంథాలయ భవనానికి మరమ్మతులు వెంటనే చేపట్టాలి.ప్రతి నెల స్లీపర్‌కు జీతాలు చెల్లించాలి. నూతన పుస్తకాలు, మ్యాగజైన్లు తెప్పించాలి.

- దారం సురేష్, పాఠకుడు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



గ్రంథాలయ సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తలుపులు, కిటీకీలు సరిగా లేక ఎలుకలు, పాములు తిరుగుతున్నాయి. అందుకే 3 రోజులుగా గ్రంథాలయం తెరవడం లేదు.

- టి. నరేష్ రెడ్డి, లైబ్రేరియన్

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

కామారెడ్డిటౌన్, డిసెంబరు 08 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని ఉదయ్ చారిటబుల్ ట్రస్ ప్రతినిధి చరణ్ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో సాందీపని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధికంగా యువతను కలిగి ఉన్న దేశం భారత దేశమని అన్నారు. అలాంటి దేశంలో యువకులు మత్తుకు బానిసై కుటుంబీకులతో పాటు ఇతరులను ఇబ్బందులు పెడుతూ భవిష్యత్తును నాషనం చేసుకుంటున్నారని తెలిపారు. దేశం అభివృద్ధి ప్రాంతంలో నడపాలంటే విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి భవిష్యత్ కార్యచరణపై దృషిసారించాలన్నారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు రాజు, నవీన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవ సర్పంచ్‌లను అభినందిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఏకగ్రీవ సర్పంచ్‌లకు అభినందనలు

ధర్పల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్పల్లి మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులు సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని గుడితాండా, మోబిన్‌సాబ్ తాండా, మద్దుల్‌తాండా, నడిమితాండా సర్పంచులు మాలావత్ సరస్వతి, మాలావత్ బాలు, మేగావత్ అరుణ, దరావత్ ఖేలు, వార్డు సభ్యులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులు, వార్డులను ఎమ్మెల్యే శాలువా పుష్పగుచ్ఛంతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. గ్రామస్థులు పెట్టుకున్న ఆశలను వమ్ముచేయకుండా అనునిత్యం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. గ్రామాలకు ప్రభుత్వం సైతం నజరానా ప్రకటిస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, చెలిమెల నర్సయ్య, మాజీ సర్పంచ్ లింబ్యానాయక్, మోహన్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా



ప్రచారం చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి శోభ నర్సింలుయాదవ్

భిక్కనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజలు సర్పంచ్‌గా అవకాశం ఇస్తే గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి చుపిస్తానని భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామసర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి మాడుగుల శోభా నర్సింలుయాదవ్ ఓటర్లను అభ్యర్థించారు. సర్పంచ్ ఎన్నికల్లో బాగంగా గ్రామంలో సోమవారం ఇంటింటి ప్రచారాన్ని తన భర్త నర్సింలు యాదవ్, అనుచరులతో కలిసి నిర్వహించింది. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి వెళ్లి తనకు ఓటేయ్యాలని, ఈ నెల 11న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గ్రామ ప్రజలు తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాగా శోభనర్సింలు యాదవ్ ప్రచారానికి గ్రామంలో విశేష స్పందన వస్తుంది. గ్రామ యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అధికారులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్ కుమార్

రాజంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే 190 మంది ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికలు నిర్వహించే విధివిధానాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా శిక్షణ అధికారులు సంతోష్ కుమార్, జైపాల్ మాట్లాడుతూ.. గ్రామాలలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే సమయంలో విధివిధానాలు, పాటించవలసిన నిబంధనలు, ఏజెంట్ల నియామకం, కౌంటింగ్ యాటిప, సర్పంచ్ ఎన్నిక విధులపై శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ జోనల్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో న్యాయవాదులు



రాగుల దేవేందర్‌గౌడ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న న్యాయవాదులు

దోమకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దోమకొండలో సర్పంచ్‌గా రాగుల దేవేందర్‌గౌడ్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం కామారెడ్డికి చెందిన పలువురు న్యాయవాదులు ప్రచారం నిర్వహించారు. పలు కాలనీల్లో తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా దేవేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, మార్పు కోరుకుంటున్నారన్నారు. గతంలో సర్పంచ్‌లుగా చేసిన కొందరు వ్యక్తులు భూములు కబ్జాలు చేశారని ఆరోపించారు. అలాంటి పాలన చేయకుండా ఉండాలని తనకు ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఒక న్యాయవాదిగా, విద్యావేత్తగా చట్టాలపై అనుభవం ఉన్న వ్యక్తిగా సర్పంచ్‌గా బరిలోకి రావడం పట్ల ప్రజలు తనకు అవకాశం కల్పిస్తామని హామీ ఇస్తున్నారని వివరించారు. ప్రచారంలో న్యాయవాదులు, రాహుల్, నరేష్, వేణు, ప్రభు పాల్గొన్నారు.

అన్నప్రసాదానికి రూ.10,116 విరాళం



సేవాసమితి చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దృశ్యం

దోమకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో నిర్వహిస్తున్న అన్నప్రసాదానికి మండలంలోని లింగుపల్లి గ్రామానికి చెందిన పోగుల మారుతి అయ్యప్ప అన్నప్రసాద సేవా సమితి చైర్మన్ తీగల సుదర్శన్‌గౌడ్‌కు రూ. 10,116 విరాళంగా అందజేశారు. అయ్యప్ప దీక్షకాలంలో స్వాములకు నిత్యం అన్నప్రసాదాన్ని అందిస్తున్నట్లు సేవాసమితి కార్యదర్శి సందేల అబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు శర్మ, మల్లిక్, పున్న లక్ష్మణ్, నరేందర్, రంజిత్‌గౌడ్, తమిత్ మిశ్రా పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

సదాశివనగర్, డిసెంబరు 08(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు ఈ నెల 9వ తేదీ సాయంత్రం లోపు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఎన్నికల పరిశీలకులు సత్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించి ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై రాజు

రాజంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాయిపల్లి గ్రామ శివారులో సోమవారం ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహన ధ్రువపత్రాలు ఉంచుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది చిరంజీవి, ఫుల్‌సింగ్ పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: మండలంలోని జక్కల్‌దాని తండా సమీపంలో ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఆర్‌ఐ సాయిలు మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల ప్రకారం అక్రమంగా డబ్బులు, మద్యం తరలించినట్లైతు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'మహాలక్ష్మి' మేజిక్

13.9 కోట్ల ప్రయాణాలు



ప్రయాణికులతో కిక్కిరిసిన ప్రయాణ ప్రాంగణం

కామారెడ్డి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రీజియన్ పరిధిలో ఆరుడిపోలు ఉన్నాయి. నిజామాబాద్-1, నిజామాబాద్-2, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, కామారెడ్డి డిపోల పరిధిలో ఆర్టీసీ బస్సులు రద్దీగా కనిపిస్తున్నాయి. రెండేళ్లలో నిజామాబాద్ రీజియన్‌లోని డిపో-1లో సుమారు 2కోట్ల 10లక్షల 88వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించగా, డిపో-2లో ఒక కోటి 29లక్షల 59వేల మంది, బోధన్ డిపోలో 2కోట్ల 2వేలమంది, ఆర్మూర్ డిపోలో 1కోటి 96లక్షల 28వేల మంది, బాన్సువాడ డిపోలో 2కోట్ల 9లక్షల 11వేల మంది, కామారెడ్డి డిపో పరిధిలో 3కోట్ల 63లక్షల 9వేల మంది ఉచితంగా ప్రయాణించారు. రీజియన్ పరిధిలో కామారెడ్డి డిపో అత్యధికంగా 3కోట్ల 63లక్షల 9వేల మంది ప్రయాణించగా, అత్యల్పంగా ఆర్మూర్ డిపో 1కోటి 96లక్షల 28వేల మంది మహిళలు ప్రయాణించారు.. మొత్తంగా రెండేళ్లలో 13కోట్ల 9లక్షల మంది మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని చేశారు. ఇందులో అత్యధికంగా సుమారు రోజువారిగా కామారెడ్డి డిపో పరిధిలో 50వేల మంది మహిళలు ప్రయాణించగా, అత్యల్పంగా నిజామాబాద్-2 డిపో పరిధిలో 18వేల మంది రోజువారిగా తమ ప్రయాణాలను కొనసాగించారు.

డ్రైవర్లకు, కండక్టర్లకు ఇబ్బందులు

ఉచిత బస్సు పథకం రద్దీతో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు అదనపు బారం పడింది. ఒక్కో బస్సులో 50నుంచి 60మంది ప్రయాణించాల్సి ఉండగా 100నుంచి 130మంది బస్సులో ప్రయాణించడంతో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు ఇబ్బందిగా మారింది. గతంలో ప్రయాణించే వారి సంఖ్యకు రెట్టింపు ప్రయాణాలు ఆర్టీసీ బస్సులలో కొనసాగుతుండడంతో ఉద్యోగులకు విధులు నిర్వహించడం తలనొప్పిగా మారింది. కొన్నిచోట్ల ఇప్పటికే ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌లపై గొడవలకు దిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రయాణికుల రద్దీతో కండక్టర్లు బస్సులో మొదటి నుంచి చివరి వరకు టికెట్‌ల కోసం వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. ఓవర్‌లోడ్ సమస్యతో నిత్యం బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయి.

రూ. 501.82 కోట్ల ఆదాయం

ఆర్టీసీకి మహాలక్ష్మీ పథకం కలిసివచ్చింది. ఉచిత ప్రయాణాలకు ప్రభుత్వం ఆర్టీసీకి డబ్బులు చెల్లిస్తుండటంతో భారీగా ఆదాయం సమకూరింది. నిజామాబాద్ రీజియన్ వ్యాప్తంగా రెండేళ్లలో సుమారు రూ.501కోట్ల 82లక్షల ఆదాయాన్ని అర్జించింది. అత్యధికంగా కామారెడ్డి డిపో పరిధిలో 116కోట్ల 46లక్షల 66వేల ఆదాయం సమకూరగా, రెండో స్థానంలో నిజామాబాద్-2 డిపో 80కోట్ల 26లక్షల 16వేలు ఆర్జించగా, మూడోస్థానంలో నిజామాబాద్-1 డిపో పరిధిలో రూ.79కోట్ల 71లక్షల 6వేలు సమకూరాయి. బాన్సువాడ డిపోలో 77కోట్ల 17లక్షల 15వేలు, ఆర్మూర్ డిపో పరిధిలో రూ.74కోట్ల 99లక్షల 51వేలు, బోధన్ డిపో పరిధిలో రూ.73కోట్ల, 18లక్షల 41వేల ఆదాయం సమకూర్చింది. అత్యధికంగా కామారెడ్డి డిపో, అత్యల్పంగా బోధన్ డిపో ఆదాయాన్ని అర్జించింది. రీజియన్ వ్యాప్తంగా సంవత్సరానికి సుమారు రూ.250కోట్ల ఆదాయాన్ని అర్జించింది.

ఉచిత బస్సుతో డబ్బు ఆదా అవుతోంది



● శైలజ, అయిలాపూర్

ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం సంతోషంగా ఉంది. కానీ సరిపడా బస్సుల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్‌పాస్ డబ్బులు కూడా చెల్లించకుండానే ఉచితంగా బస్సులో ప్రయాణిస్తున్నాం. మహిళల కోసం ఇలాంటి పథకాలను ప్రారంభించడం ప్రభుత్వానికి కృతజ్ఞతులు చెప్తున్నా.



పార్టీలో చేరిన నాయకులకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని సోమార్‌పేట్ గ్రామంలో 80 మంది బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేస్తున్న సేవలకు ఆకర్షితులై పెద్దఎత్తున చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక విద్యను అందించాలి

కామారెడ్డి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సృజనాత్మక విద్యను అందించాలని ఎంఈవో ఎల్లయ్య అన్నారు. కామారెడ్డి మండలం లింగాయిపల్లి, తిమ్మక్‌పల్లి, చిన్నమల్లారెడ్డి గ్రామాల్లోని పాఠశాలలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులకు రాయడం, చదవడం తప్పనిసరిగా నేర్పించాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యంగా అందించాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. సీఆర్పీ చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తున్న ఎంఈవో ఎల్లయ్య

ఎన్నికల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో ఏవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఏవో అహ్మద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి మూడు విడుతలు ఉంటే ఒక డ్యూటీని మినహాయింపు ఇవ్వాలని, అదే విధంగా అసలే డ్యూటీ రాని వారికి కనీసం ఒక డ్యూటీ అలర్ట్ చేయాలన్నారు. 80 కి.మీ. దూరంలో ఎన్నికల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు మరుసటి రోజు విధులకు హాజరు కాకుండా మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. ఎన్నికలు జరిగే ప్రతి మండలం డివిజన్ కేంద్రానికి, జిల్లా కేంద్రానికి రవాణ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ విద్యార్థినికి గోల్డ్‌మెడల్



గడికోటలో క్రీడాకారిణిని సన్మానిస్తున్న దృశ్యం

దోమకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అసోసియేషన్ ఆర్చరీ సీనియర్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారిణి కదిరె సింధూజను సోమవారం కామారెడ్డి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల తిర్మల్‌గౌడ్ సన్మానించారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సీనియర్స్ విభాగంలో సింధూజ ప్రతిభ చూపినట్లు వివరించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, గంగధర్, గంగారాజు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు తొలగిస్తే ఊరుకోం

(5వ పేజీ తరువాయి)

ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని, చిరువ్యాపారులను ఇక్కడ దుకాణాలు ఖాళీచేసి వెళ్లిపోవాలని సూచించడం సబబు కాదన్నారు. ఇప్పటికే సర్వేనంబర్ 6లో గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న 12మంది బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించకుండానే వారి రేకుల షెడ్డులను కూల్చివేయడంతో ప్రస్తుతం వారు రోడ్డున పడ్డారన్నారు. తాము అభివృద్ధిని అడ్డుకోవడం లేదని, కానీ 45 ఏళ్లగా వీటినే నమ్ముకొని బతుకుతున్న చిరువ్యాపారులు రోడ్డున పడకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. నాయకులు విజయకుమార్ రెడ్డి, శ్రీనివాస్, సుధాకర్, చాట్ల వంశీ, సలీం, గడ్డమీది మహేష్, రమేష్, సేవాదళ్ అధ్యక్షులు మహేష్, రంగా రమేష్, గౌరు నవీన్, ఆబిద్, బల్ల శ్రీనివాస్, మున్ను, అహ్మద్, శశి, శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

దోమకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి జి. నగేష్ కంప్యూటర్‌ను సోమవారం అందజేశారు. ఆయన ప్రభుత్వ శాఖలో ఉద్యోగం చేసి పదవి విరమణ చేశారు. పాఠశాలకు తనవంతుగా సహాయం ,చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాధాలక్ష్మీ, బాపురెడ్డి, పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బయటకు వెళ్లొద్దు



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ శివరాం, పోలీసులు

నిజాంసాగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అనుమతి లేకుండా బయటకు వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని జిల్లా కోఆర్డినేటర్ శివరాం అన్నారు. సోమవారం మండలంలోని అచ్చంపేట గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఆదివారం జరిగిన సంఘటనపై విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన అజయ్ నీటమునిగి మరణించడం బాధాకరమన్నారు. గురుకుల పాఠశాలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ముఖద్వారాన్ని ఎప్పుడూ మూసిఉంచాలని, గేట్ కీపర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. ఇంచార్జి ప్రిన్సిపాల్ గణపతి, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు ఎంపికైన యువకుడికి సన్మానం



యువకుడిని సన్మానిస్తున్న తండావాసులు

లింగంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలోత్ సంగ్యానాయక్‌తండాకు చెందిన మాలోత్ నితీన్ ఇటీవల సైన్యంలో చేరేందుకు అగ్నిపథ్‌కు ఎంపికయ్యాడు దీంతో గ్రామస్తులు సోమవారం అతణ్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన సర్పంచ్ సక్రు మాట్లాడుతూ.. యువత సైన్యంలో చేరి దేశరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో విఠల్ నాయక్, తండావాసులు శివరాం, మూనియానాయక్ తండా వాసులు ఉన్నారు.

సిద్ధరామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

భిక్కనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయంలో సోమవారం స్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని మూలబావి వద్ద స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈవో శ్రీధర్, అర్చకులు రామగిరిశర్మ, సిద్దగిరి శర్మ, సిద్దశ్, రాజేశ్వరశర్మ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- ఆంధ్రా కింగ్ తాలుకా
ప్రియ 35- రాజు వెడ్స్ రాంబాయి
దర్శన్- జటదార

బాన్సువాడ

మహేశ్వరి ఆంధ్రాకింగ్ తాలూకా
వెంకటేశ్వర కలివివనం

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

అవినీతి కంపు

(5వ పేజీ తరువాయి)

వసూలుచేసి అధికారులకు అందజేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు ప్రైవేటు ఏజెంట్లు, డ్రైవర్లను ఏర్పాటు చేసుకొని లంచాలు తీసుకుంటూ ఏసీబీకి దొరకకుండా తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. లంచాలను రూపుమాపడానికి ప్రతీ పౌరుడు నడుం బిగిస్తే అవినీతిని రూపుమాపవచ్చని వాళ్ళు అభిప్రాయపడుతున్నారు.

ఏడాదిలో ఏసీబీకి చిక్కిన ఐదుగురు ఉద్యోగులు

జిల్లాలో గడిచిన సంవత్సర కాలంలో ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీకి చిక్కినట్లు అవినీతి నిరోధక శాఖ చెబుతోంది. గత ఐదేళ్లలో సుమారు 15 మంది ప్రభుత్వ వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు ఏసీబీకి పట్టుపడ్డారు. ఇందులో ఎక్కువగా రెవెన్యూ, పోలీసులు, ఎలక్ట్రిసిటీ, ఆర్టీఏ, మున్సిపల్, పంచాయతీ శాఖలకు చెందినవారు ఉన్నట్లు తెలిసింది. గత ఎనిమిది నెలల్లో పోలీసుశాఖకు చెందిన నలుగురు ఏసీబీకి పట్టుబడ్డారు. లింగంపేట ఎస్ఐ అరుణ్‌కుమార్, రైటర్ రామస్వామిలు ఓ నిందితునికి స్టేషన్‌బెయిల్ విషయంలో రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. అదే పోలీసు స్టేషన్‌కు చెందిన ఎస్ఐ సుధాకర్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓ చీటింగ్ కేసులో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.12500 లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కాడు. గత మే 23న కోర్టు కేసులో ఓ కానిస్టేబుల్, కోర్టు పీపీ రూ.10వేలు లంచం తీసుకుంటూ దొరికారు. గతంలో రెవెన్యూ శాఖలోని కంప్యూటర్ ఆపరేటర్ ఏసీబీకి పట్టుపబడగా పంచాయతీకి శాఖకు చెందిన ఓ సెక్రెటరి, ఎలక్ట్రిసిటికి చెందిన ఓ ఏఈ, మున్సిపల్‌లోని రెవెన్యూ సిబ్బంది ఏసీబీకి పట్టుపడ్డారు. జిల్లాలోని ఆర్టీఏ చెక్‌పోస్టులపై ఏసీబీ తనిఖీలు చేయగా లెక్కలో లేని అవినీతి సొమ్ము వేల రూపాయాల్లో సీజ్ చేశారు.

ప్రశ్నించే తత్వంతోనే చెక్

ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే ప్రతీ పౌరుడు ప్రశ్నిస్తేనే అవినీతిని నిర్మూలించవచ్చని పలువురు భావిస్తున్నారు. సామాన్య ప్రజలు నోరు మెదిపితేనే అక్రమాలు బయటకు వస్తాయి. సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతిపరుల బాగోతాన్ని బట్టబయలు చేయడం, అలాగే న్యాయవ్యవస్థలో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేయడం, సమస్యలను హక్కుల పరిరక్షణ సంఘాల దృష్టికి తేవడంలాంటి వర్గాల ద్వారా అక్రమార్కుల ఆట కట్టించవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి నిర్మూలనకు పటిష్ఠ విధానాలను అమలు చేయాలి. పౌర సేవల చట్టం అమల్లోకి తేవడం, సమాచార హక్కు చట్టానికి స్వేచ్ఛ కల్పించడం, అవినీతిపరులైన ఉద్యోగుల ఆస్తులను స్తంభింపజేయడం, లాంటి మార్గాల ద్వారా అవినీతిని నిర్మూలించవచ్చు. రాత్రికి రాత్రే అవినీతిని తరిమికొట్ట లేకపోయినా వ్యవస్థలను చక్కదిద్దుకుంటే చాలావరకు అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు. వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారితనం పెంపొందించవచ్చు.

నేడు అవినీతి వ్యతిరేక దినం

ప్రపంచవ్యాప్తంగా అవినీతి పెరిగిపోతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి 2003 డిసెంబరు 9న ప్రతీ సంవత్సరం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని జరపాలని తీర్మానించింది. ఈ మేరకు ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 9న అవినీతి వ్యతిరేక దినోత్సవం పై సమావేశాలు, ర్యాలీలు, విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోనూ ఏసీబీ ఆధ్వర్యంలో అవినీతి వ్యతిరేక దినోత్సవంపై పలు కార్యక్రమాలు చేపడుతున్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

ప్రిసైడింగ్ అధికారులు, 3,771 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ

మొదటి విడత పోలింగ్ నిర్వహణకు సంబంధించి అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇప్పటికే పూర్తిచేశారు. పోలింగ్‌లో పాల్గొనే ఉపాధ్యాయులతోపాటు డివిజన్, జిల్లా అధికారులకు ఎన్నికల శిక్షణ ఇస్తున్నారు. రెండో విడత ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు వారికి కేటాయించిన మండలాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. మూడో విడతకు సంబంధించిన వారికి ఈనెల 10 లోపల శిక్షణ ఇవ్వనున్నారు. 200 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఒక్క ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారిని నియమించనున్నారు. 400లోపు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ముగ్గురిని, 400లకు పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో నలుగురికి కేటాయించనున్నారు. ఎన్నికల సామగ్రిని ఆయా మండలాలకు అధికారులు పంపించి సిద్ధం చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా బ్యాలెట్ బ్యాక్స్‌లు, స్టేషనరీ, మండల కేంద్రాలకు తీసుకువస్తున్నారు. బ్యాలెట్ పత్రాల ప్రింటింగ్‌ను నోడల్ అధికారులుగా నియమించిన జిల్లాస్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఎన్నికల్లో లోపాలకు తావివ్వొద్దు

(5వ పేజీ తరువాయి)

కలెక్టర్ సందర్శించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రతి అధికారి తన బాధ్యతను నిబద్ధతో, న్యాయం, పారదర్శక, శాంతిభద్రతలతో నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఆర్డీవో వీణ, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంఈవో, శిక్షణ నిర్వహకులు నర్సింలు, జ్యోతి పాల్గొన్నారు.

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో చేపట్టాలి

కామారెడ్డి రూరల్: జిల్లాలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించడానికి మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశపు హాల్‌లో సోమవారం ఎన్నికల నిర్వహణలో భాగంగా మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అబ్జర్వర్ల బాధ్యతలు, ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నిబంధనలపై కలెక్టర్ వివరణాత్మకంగా మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రతీ కార్యకలాపాలను జాగ్రత్తగా పర్యవేక్షించి ఎలాంటి లోపాలు కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు నివేదించాల్సిన అవసరాన్ని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ వివరించారు. సాధారణ పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎన్నిక విధానాలు, పోలింగ్ ప్రక్రియ, ఎలక్ట్రోల్ రూల్స్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటించడం వంటి వాటి పై వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి అబ్జర్వర్ బాధ్యతయుతంగా పని చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ భాగంగాల నుంచి ఎంపికైన మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మదన్‌మోహన్, డీపీవో మురళి, డీఎల్‌పీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.